సాక్షి పెద్దపల్లి

శుక్రవారం ၊ 26 ၊ మే ၊ 2023



తగ్గిన ఎరువుల భారం

వానాకాలం పంటల సాగుకు రైతులకు ఊరట లభించనుంది. పెట్టుబడి వ్యయం పెరుగుతున్న క్రమంలో ఎరువుల ధరలు దిగిరావడం అన్నదాతకు ఉపశమనం ఇచ్చే అంశం. 8లో▸



సీఎం సమావేశంలో కలెక్టర్

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో గురువారం సచివాలయంలో కలెక్టర్లు, పోలీసు అధికారులతో సీఎం కేసీఆర్ సమావేశమయ్యారు. ఇందులో కలెక్టర్ సంగీత పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
40.0/29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత విపరీతంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

గ్రామాల అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యం



పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న పుట్ట మధు

యైటింక్లయిన్‌కాలనీ: గ్రామాలను అభివృద్ధి చేయడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. గురువారం రామగిరి మండలం చందనపూర్ పంచాయతీ నూతన కార్యాలయానికి భూమిపూజ నిర్వహించారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచే గ్రామాలు అభివృద్ధిబాట పట్టాయని పేర్కొన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ దాసరి శంకరయ్య, ఎంపీటీసీ సుకన్య, ఎంపీఓ భాస్కర్, ఉప సర్పంచ్ సాగర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, మండలం కో–ఆప్షన్ ఇబ్రహీం పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 30న బీజేపీ ధర్నా

పెద్దపల్లిరూరల్: జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, తూకంలో కోత విధిస్తున్నారని, వాటిని నివారించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి తెలిపారు. ధర్నాకు అనువైన స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, నాయకులు కౌశిక హరి, ఠాకూర్ రాంసింగ్, కన్నం అంజయ్యతో కలిసి గురువారం పరిశీలించారు. వెంట నాయకులు పర్శ సమ్మయ్య, శ్రీనివాసరావు, తొడుపునూరి కృష్ణమూర్తి, పుట్టరవి, వెంకటేశం, కుమార్, స్వామి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఉషాకుమార్, బాలికలు

జ్యోతినగర్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్టీపీసీ రామగుండం దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్ అన్నారు. గురువారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో పరిశుభ్రత–స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా బాలికాసాధికారత మిషన్ శిక్షణశిబిరం బాలికలతో కలిసి మార్నింగ్‌వాక్‌లో పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ఆరోగ్య లక్షణమన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణంపై అవగాహన పెంచుకుని మొక్కలు నాటాలని సూచించారు. మార్నింగ్ వాక్ టౌన్‌షిప్‌లోని పలు వీధుల మీదుగా కొనసాగింది. దీప్తి మహిళా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయండి



మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

గోదావరిఖని: రామగుండంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో పేదలకు ఉచిత వైద్యం అందుతోందని, అలాగే ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను కూడా ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వినతిపత్రం అందించారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఫైవింక్లయిన్ యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు, నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటామని తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎంసెట్‌లో 2,686 ర్యాంకు



జాహ్నవి

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేట గ్రామానికి చెందిన ఇరుగురాల జాహ్నవి ఎంసెట్‌లో 2,686 ర్యాంకు సాధించింది. పదో తరగతిలో 9.8 జీపీఏ, ఇంటర్ (బైపీసీ)లో 976 మార్కులు సాధించిన జాహ్నవి.. ఎంసెట్‌లో ర్యాంకు సాధించడంపై సర్పంచ్ కొండ వెంకటేశ్ అభినందించారు.

సాగు ప్రణాళిక ఖరారు

- వానాకాలం 2,83,321 ఎకరాల్లో పంటలు
- ఎప్పటిలాగే ఈసారి కూడా వరికే అగ్రస్థానం
- 2,13,815 వరి.. 65,500 ఎకరాల్లో పత్తి
- విత్తనాలు, ఎరువులు సిద్ధం



దుక్కులు సిద్ధం చేస్తున్న రైతు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో వానాకాలం సాగయ్యే పంటల ప్రణాళికను వ్యవసాయాధికారులు ఖరారు చేశారు. జిల్లావ్యాప్తంగా 2,83,321 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా 2,13,815 ఎకరాల్లో వరిపంట సాగయ్యే అవకాశముందని, 65,500 ఎకరాల్లో పత్తి పంట సాగవుతుందని ప్రభుత్వానికి నివేదించారు.

జిల్లాలోని 54 క్లస్టర్ల పరిధిలో..

జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి పంటలనే అన్నదాతలు సాగు చేస్తున్నారు. 54 క్లస్టర్ల పరిధిలో ఉన్న భూముల్లో 2,83,321 ఎకరాల్లో వరి, పత్తితోపాటు మొక్కజొన్న, అపరాలు, కూరగాయలు వంటి పంటలు సాగవుతాయని అధికారులు అంచనాకు వచ్చారు. పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఏ మేరకు అవసరమవుతాయి..? ప్రస్తుతం ఎంత నిల్వ ఉన్నాయి..? అనే వివరాలను నిర్ధారించి ప్రణాళికలో పొందుపర్చారు.

రోహిణీ కార్తె ప్రవేశంతో..

రైతులు పంటలను రోహిణీకార్తెలోనే సాగు చేయాలని భావిస్తుంటారు. గురువారం రోహిణీకార్తె ప్రవేశించడంతో జిల్లాలోని పలు మండలాల్లో రైతులు దుక్కులు దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. గత సీజన్‌లో వచ్చిన ధాన్యం దిగుబడి ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే ఉండడం రైతులను కొంత కలవరపెడుతోంది. అయినా వానాకాలం పంట సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు.

స్వల్పంగా పెరగనున్న సాగువిస్తీర్ణం..

జిల్లాలో గత వానాకాలం సాగైన పంటల విస్తీర్ణం కన్నా ఈసారి స్వల్పంగా పెరగనుంది. గత వానాకాలంలో 2,77,645 ఎకరాల్లో పంటలు సాగుకాగా ఈ వానాకాలంలో 2,83,321 ఎకరాల్లో సాగయ్యే అవకాశముందని అధికారులు అంచనావేశారు. అంటే 5,676 ఎకరాల ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుకానున్నాయి. ఇందులో వరిపంట ఈసారి 2,13,815 ఎకరాల్లో సాగవుతుందని అంచనా. ఇది గతేడాదికన్న 1604 ఎకరాల్లో ఎక్కువ. పత్తి పంట ఈ సారి 65,500 ఎకరాల్లో సాగుకానుండగా గతేడాది కన్న 2745 ఎకరాల్లో ఎక్కువ.

విత్తనాలు, ఎరువులు అవసరం ఇలా..

జిల్లాలో పంటలసాగును ఖరారు చేసిన అధికారులు.. అందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసేందుకు నిర్ణయించారు. వరిసాగుకు 53,450 క్వింటాళ్ల విత్తనాలు, 1,71,254 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని నిర్ధారించారు. అలాగే యూరియా 33,322 మెట్రిక్ టన్నులు, డీఏపీ 8,552 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 7,125 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 25,488 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని గుర్తించారు.

ఇబ్బందుల్లేకుండా చర్యలు



జిల్లాలో వానాకాలం పంటసాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. నకిలీ, కల్తీ విత్తనాలు జిల్లాకు రాకుండా చూసేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలు పనిచేస్తున్నాయి. భూసారం పెంచుకునేందుకు ముందుకొచ్చిన రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందించాం. – ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లా సమాచారం

మండలాలు 14

భూవిస్తీర్ణం 2,95,194 ఎకరాలు

సాగయ్యే భూమి 2,83,321 ఎకరాలు

రైతుల సంఖ్య 1,52,184

ప్రధానపంటలు వరి, పత్తి

జిల్లాలో సాగువిస్తీర్ణం (ప్రధానపంటలు) ఇలా..

పంట	గతేడాది (ఎకరాల్లో)	ఈ ఏడాది (ఎకరాల్లో)
వరి	212211	213815
పత్తి	62755	65500
మొక్కజొన్న	827	1305
మిరప	760	790
కంది	691	1302
పసుపు	254	280
వేరుశనగ	21	50

రైతులు కన్నీరు పెడుతుంటే సీఎం కప్ పోటీలా..?

- కొనుగోలు కేంద్రాలను సందర్శించిన బీజేపీ మాజీ ఎమ్మెల్యేలు



గోలివాడ కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బీజేపీ ప్రతినిధులు

రామగుండం: రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అరిగోసపడుతుంటే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మాత్రం సీఎం కప్ క్రీడాపోటీల్లో మునిగితేలుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య, కౌశిక హరి, కన్నం అంజయ్య విమర్శించారు. గురువారం అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ, ఎల్లంపల్లి, ముర్మూర్ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో గతంలో ఎప్పుడూ ఇబ్బంది ఉండేదికాదని, ఇప్పుడు తరుగు పేరిట 42 కిలోలు కేంద్రాల్లోనే తూకం వేస్తున్నారని, మిల్లులకు చేరాక మరోసారి కోత పెడుతున్నారని ఆరోపించారు. కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 25శాతం ధాన్యం మిల్లులకు చేరలేదన్నారు. ధాన్యం కొనుగోళ్లు శరవేగంగా సాగుతున్నాయన్న మంత్రి గంగుల కమలాకర్ వ్యాఖ్యలను ఖండించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. వారివెంట కార్పొరేటర్ కౌశిక లత, గాలెంకి ప్రసాద్, గంగాప్రసాద్, మహావాది రామన్న, మారం వెంకటేశ్, కట్కూరి శ్రీధర్‌రెడ్డి, ధర్మాజి శ్రీనివాస్, మద్దికుంట శంకర్ తదితరులున్నారు.

నాడు ఎన్టీఆర్.. నేడు కేసీఆర్



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పుట్ట మధు

- చరిత్ర సృష్టించిన నాయకులు వీరే
- జిల్లా పరిషత్ ఛైర్మన్ పుట్ట మధు

మంథని: టీడీపీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే రాష్ట్రంలో అధికారం చేపట్టి ఆనాడు నందమూరి తారకరామారావు చరిత్ర సృష్టించారని, తెలంగాణ ఉద్యమాన్ని ఒక పద్ధతిలో తీసుకెళ్లి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ చరిత్రను తిరగరాశారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథనిలోని బొక్కలవాగు వంతెనపై పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. టీడీపీ ఆవిర్భావం సమయంలో ఎక్కువ మంది బీసీలే జెండా పట్టుకున్నారని, పటేల్, పట్వారి వ్యవస్థ, ఆడబిడ్డలకు ఆస్తిలో వాటా కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దని అన్నారు. మహనీయుల చరిత్ర ప్రతిఒక్కరూ తెలుసుకోవాలనే ఇక్కడ విగ్రహాలను నెలకొల్పుతున్నామన్నారు. జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, మెండె రాజయ్య, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్ పాల్గొన్నారు.

ధాన్యం తరలింపునకు చర్యలు తీసుకోండి

లారీల కొరతతో ధాన్యం కేంద్రాల్లో నిలిచిపోయిందని, తరలింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని పుట్ట మధు మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ సంగీతను ఫోన్‌లో కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించిన అనంతరం మాట్లాడారు. మిల్లర్ల వద్ద ధాన్యం ఎక్కువైతే గోదాంలో నిల్వ చేయాలని సూచించారు.



కన్నుల పండువగా అయ్యప్ప స్వామి శోభాయాత్ర

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా గురువారం స్వామివారి మూల విరాట్‌ను గుర్రాల రథంపై కేరళ సాంప్రదాయం, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా శోభాయాత్ర చేపట్టారు. కాలనీ పురవీధుల మీదుగా మేళతాళాలు, వాయిద్యాల మధ్య, కోలాటబృందాలు, ఒగ్గు కళాకారులతో షాపింగ్ కాంప్లెక్స్, షిర్కే బస్‌స్టాప్, తెలంగాణ చౌరస్తా, వివేకానంద చౌరస్తా మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఉదయం 5 గంటలకు సజీవ్ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో అష్టద్రవ్య గణపతి హోమం, అంకురార్పణ పూజ, మృత్యుంజయ, త్రిష్టుప్ హోమం, ప్రాయచిత్త హోమం, విగ్రహ పరిగ్రహ హోమం, మహా సుదర్శన హోమం విగ్రహ పరిగ్రహ పూజ, దన్వతరి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన గురుస్వామి అద్దెంకి సారంగచారి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నదాతలను దోచుకుంటున్నారు



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రైతులు ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి శ్రమించి పంట పండిస్తే రైతుల శ్రమను పాలకులు, అధికారులు దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు, మండలంలోని కొత్తపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. కేంద్రాల్లో తూకం వేసే తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుందామని కేంద్రానికి వస్తే తూకంలో క్వింటాల్‌కు కనీసం 7కిలోల నుంచి 10కిలోల దాకా కోత విధిస్తూ కోట్లాది రూపాయల రైతు శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. అధికార యంత్రాంగమే తూకం వేసిన ధాన్యానికి రైతులకు రశీదు అందించాలని, మిల్లరు వద్దకు రైతులు వెళ్లకుండా చూడాలని జిల్లా పౌరసరఫరాశాఖ అధికారి వెంకటేశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బి.సురేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు మల్లయ్య, సంపత్, సుభాష్‌రావు, నాయకులు శ్రీమాన్, నెత్తెట్ల కుమార్, రవీందర్, శ్రీనివాస్, నూగిల్ల వీరేశం, అర్కుటి సంతోష్, జగదీశ్, సర్వర్, ఖాజా, సతీష్, హకీం, అనిల్, శ్రవణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల వేటలో అధ్యాపకులు

ప్రైవేట్ కళాశాలల మాదిరిగానే ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాల కోసం అధ్యాపకులు ఆరాట పడుతున్నారు. తాము పనిచేస్తున్న కళాశాలల్లో చేరితే చేకూరే ప్రయోజనాలను వివరిస్తూ విద్యార్థులతోపాటు వారి తల్లదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల వివరాలు సేకరించి ఊరూరా బృందాలుగా ఏర్పడి అడ్మిషన్ డ్రైవ్ చేపడుతున్నారు.

- అడ్మిషన్ల కోసం విస్తృత ప్రచారం
- ఊరూరా తిరుగుతూ అవగాహన



తమ కళాశాలలో చేరాలని కోరుతున్న అధ్యాపకులు

మంథని: జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 2,500 మంది చదివారు. మొదటి సంవత్సరం 2,400 ఉన్నారు. అన్ని కళాశాలల్లో కలిపి 200మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. వీరంతా పక్షంరోజులుగా బృందాలుగా ఏర్పడి ప్రభుత్వ కళాశాలల్లో చేరితే పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్య అందిస్తామని, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు అందుతాయని, కళాశాలల్లో సౌకర్యాలపై వివరిస్తున్నారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభను కరపత్రాల రూపంలో ముద్రించి గ్రామాల్లో పంచుతున్నారు.

సౌకర్యాల మెరుగుతో ప్రభుత్వం వైపు మొగ్గు

గతంలో ప్రభుత్వ కళాశాలలంటేనే విద్యార్థులు చేరడానికి వెనుకంజ వేసేవారు. సౌకర్యాల లేమితో ఇబ్బందుల్లో ఉన్న ప్రభుత్వ కళాశాలలను సర్కారు అభివృద్ధి చేసింది. ప్రతి కళాశాలకు రూ.కోటి నుంచి రూ.మూడు కోట్ల వరకు వెచ్చించి పక్కా భవనాలు, డ్యూయల్ డెస్కులు, సమీకృత మరుగుదొడ్లు, మినరల్ ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించింది. దీంతో కళాశాలల్లో అడ్మిషన్లు పెరుగుతూ వస్తున్నాయి. ఇందులో చదివిన సైన్స్ విద్యార్థులకు ఎంసెట్‌లో ఎంత ర్యాంకు వచ్చినా పూర్తిస్థాయిలో కళాశాల ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ కళాశాల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఫలితాల్లో మేటి

కొన్నేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదివిన విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించి ఫలితాల్లో మేటి అనిపిస్తున్నారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో కమాన్‌పూర్ మండలం గుండారం కళాశాలకు చెందిన రాధారపు శ్రీనిధి బైపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. 900పైగా మార్కులను చాలామంది విద్యార్థులు సొంతం చేసుకున్నారు. వీరి ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించింది.

క్రమబద్ధీకరణతో మరింత ఉత్సాహం

జిల్లాలోని 14 కళాశాల్లలో పనిచేస్తున్న 129 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను ప్రభుత్వం ఇటీవలే క్రమబద్ధీకరించింది. దీంతో వారు మరింత ఉత్సాహంతో కళాశాలల అభివృద్ధికి పాటుపడుతున్నారు. అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు ఎవరికి వారే టార్గెట్లను ఎంచుకుని ఆ దిశగా కృషి చేస్తున్నారు.

అడ్మిషన్లు పెంచుతున్నాం



ప్రభుత్వ కళాశాల్లో ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు సంఖ్య పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లతోపాటు నేనూ కృషి చేస్తున్నా. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు అధ్యాపకులు విద్యార్థులు, తల్లిదండ్రులను కలుస్తున్నారు. కళాశాలల్లో సౌకర్యాలున్నాయి. విద్యార్థులు వినియోగించుకోవాలి. – కల్పన, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

విస్తృత ప్రచారం



మండుటెండలో సైతం అడ్మిషన్ల కోసం ఊరూరా తిరుగుతున్నాం. ప్రైవేటు కంటే ప్రభుత్వ కళాశాలల్లోనే వసతులు బాగున్నాయి. ఇప్పటికే పలుమార్లు విద్యార్థులను కలిశాం. వారి నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ సారి గతం కంటే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందనే విశ్వాసం ఉంది.

– ఎల్‌ఆర్‌కె.రెడ్డి, అధ్యాపకుడు, మంథని

తగ్గిన ఎరువుల భారం

జిల్లాలో 1.53లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగం

- వానాకాలం రైతులకు ఊరట
- పెట్టుబడికి ఉపశమనం



ఎరువుల బస్తాలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): వానాకాలం పంటల సాగుకు రైతులకు ఊరట లభించనుంది. పెట్టుబడి వ్యయం పెరుగుతున్న క్రమంలో ఎరువుల ధరలు దిగిరావడం అన్నదాతకు ఉపశమనం ఇచ్చే అంశం. విపణిలో ముడి పదార్థాల ధరలు భారీగా తగ్గుతున్నాయి. దీంతో ఎరువుల కంపెనీలు ధరలు తగ్గించేందుకు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే కాంప్లెక్స్ 20:20:0:13 రకం ఎరువు ధర రూ.150 తగ్గింది. మరో పదిహేను రోజుల్లో మరింత తగ్గి బస్తా రూ.వేయి వరకు దిగివచ్చే అవకాశం ఉందని కంపెనీలు ఎరువుల డీలర్లకు సమాచారం ఇచ్చాయి.

హెచ్చుతగ్గులు

గతంలో కేంద్ర ప్రభుత్వం అధీనంలో ధరల పెరుగుదల, రాయితీలు ఉండేవి. నాలుగేళ్ల కిందట కంపెనీలకు ధరల నిర్ణయాధికారం ఇచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిపదార్థాల ధరలహెచ్చుతగ్గుదలను బట్టి ధరలను నిర్ణయిస్తున్నారు. కాంప్లెక్స్, డీఏపీ ఎరువుల తయారీకి అవసరమైన ఫాస్పరిక్ యాసిడ్, పొటాష్, ఫాస్పరస్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ప్రస్తుతం వాటి ధరలు గణనీయంగా తగ్గాయి. దాంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గుతున్నాయి. డిసెంబరులో కాంప్లెక్స్ ఎరువు(20:20:0:13) రూ.1,450 ఉండగా ప్రస్తుతం రూ.1,175కు వచ్చింది. త్వరలో అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులు బస్తాకు(50 కిలోలు) రూ.200ల నుంచి రూ.300 తగ్గే అవకాశం ఉన్నట్లు సమాచారం.

జిల్లాలో రైతులు ఇలా

జిల్లాలో ఏటా 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగిస్తారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే వరి, మొక్కజొన్న, శనగలు, పల్లి, పత్తి తదితర పంటలకు యూరియాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్‌ను వినియోగిస్తారు. రైతులు ఎకరానికి రెండు సంచుల రసాయన ఎరువు వాడుతున్నారు. యాసంగిలో రూ.1,450 ఉన్న కాంప్లెక్స్ ఎరువు ధర ప్రస్తుతం రూ.1,175 ఉంది. బస్తాకు రూ.275 తగ్గింది.

వినియోగంలో మార్పులు

ఎరువుల వినియోగంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే యూరియా ద్రవరూపంలో నానోపేరిట అందుబాటులోకి రాగా, తాజాగా డీఏపీ కూడా నానో రూపంలో వచ్చింది. వీటితో ఎరువుల వినియోగం మరింత సులభమవుతోంది. ప్రస్తుతం 50 కిలోల డీఏపీ సంచి ధర రూ.1,350 ఉండగా నానో డీఏపీ అరలీటర్ ధర రూ.600లతో విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. యూరియా సంచి ధర రూ.266 ఉండగా నానో యూరియా అరలీటర్ ధర రూ.225 ఉంది.

రంగులు వేరు

ఒకేపేరు రంగులు వేరుగా గతంలో కంపెనీల పేరున ఎరువుల బస్తాలు ఉండేవి. రైతులు కొన్నింటికి చెందిన వాటినే ఎక్కువగా కొనుగోలు చేస్తుండటంతో పాటు ధరల్లో హెచ్చుతగ్గులు ఉండటంతో కేంద్రం ప్రధానమంత్రి భారతీయ జన ఊర్వరిక్ పరియోజన కింద ఒకేపేరుతో ఎరువులు విక్రయించాలని ఆదేశించింది. భారత్ యూరియా, భారత్ డీఏపీ ఇలా ఒకే పేరుతో ఎరువును బట్టి రంగును కేటాయించారు. అదే రంగుతో సంబంధిత ఎరువులను సరఫరా చేయాలని కేంద్రం నిర్దేశించింది. భారత్ పేరు పెద్దగా, కంపెనీ పేరును చిన్నగా ముద్రించి ఎరువులు విడుదల చేస్తున్నాయి. వానాకాలం సీజన్ నుంచి కొత్త సంచుల్లో ఎరువులు వస్తాయి. ఇప్పటికే కొత్త సంచులు మార్కెట్‌లోకి వచ్చాయి.

జిల్లాలో ఎరువుల ధరలు ఇలా

ఎరువు	గతంలో	ప్రస్తుతం
డీఏపీ	1,750	1,350
20.20.0.13	1,450	1,175
ఎస్ఎస్‌పీ	600	540
ఇతర	1,450	1,200

క్లుప్తంగా

నూతన టెక్నాలజీని వినియోగించుకోవాలి



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ, ఎస్సై

జూలపల్లి(పెద్దపల్లి): నూతన టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా సమస్యలు త్వరగా పరిష్కారం అవుతుందని సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న కొత్తూరుకు చెందిన పొట్టాల రవి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా లాగిన్ అయి, ఆధార్‌కార్డు, ఐఎంఈఐ వివరాలు అప్లోడ్ చేశారు. సిమ్‌కార్డు వేసిన వారి వివరాలను రామగుండం సైబర్ క్రైమ్, ఐటీ సెల్‌కు పంపించారు. ఈ మేరకు ఫోన్ వాడుతున్న వారినుంచి రికవరీ చేయడం జరిగింది. ఫోన్‌ను రవికి సీఐ సమక్షంలో అందించారు. ఎస్సై వెంకటకృష్ణ కార్యక్రమంలో ఉన్నారు.

రామగుండంలో..

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన దాన రాజు ఏప్రిల్ ఐదున తన ఫోన్ పోగొట్టుకున్నట్లు రామగుండం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టర్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను గుర్తించి గురువారం ఎస్సై శరణ్య చేతులమీదుగా బాధితుడికి అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నారాయణపూర్‌కు వెళ్లే క్రాసింగ్ వద్ద గల రాజీవ్ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ఎలిగేడు మండలం ధూళికట్టకు చెందిన చెంచు రాములుకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై విజేందర్ వివరాల ప్రకారం.. ధూళికట్ట నుంచి పనినిమిత్తం రాములు ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్‌కు వస్తున్నాడు. నారాయణపూర్ రోడ్డు క్రాసింగ్ చేస్తున్న క్రమంలో పెద్దపల్లి నుంచి సుల్తానాబాద్ వైపునకు వస్తున్న కారు ఢీ కొట్టింది. రాములుకు తీవ్రగాయాలు కాగా సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంక్రీటు వాహనం బోల్తా: డ్రైవర్ మృతి



ఇరుక్కుపోయిన డ్రైవర్ విజయ్‌సాకేత్

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపుల మానేరు వంతెన పైనుంచి అజాక్స్ కాంక్రీట్ వాహనం మానేరులో పల్టీ కొట్టడంతో డ్రైవర్ విజయ్‌సాకేత్ (20) మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన విజయ్‌సాకేత్ తన అజాక్స్ కాంక్రీట్ వాహనాన్ని అతివేగంగా అజాగ్రత్తగా నడపటంతో వాహనం జాయింట్ రాడ్ విరిగింది. అదుపు తప్పిన వెహికిల్ వంతెన పైనుంచి మానేరులో పల్టీకొట్టడంతో వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సూపర్‌వైజర్ పాతుగంటి శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్సై వివరించారు.

‘ప్రేమ’ విషయంలో ఇరువర్గాల ఘర్షణ

పాలకుర్తి: ప్రేమకోసం ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడిన వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన పాలకుర్తి మండలం బసంత్‌నగర్ విమానాశ్రయం ప్రతిపాదితస్థలంలో చోటుచేసుకుంది. బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన అమ్మాయితో ప్రేమవ్యవహారం విషయంలో పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన పొన్నం మహేశ్‌గౌడ్, పాలకుర్తి గ్రామానికి చెందిన రావుల శివకు మధ్య గొడవ సాగుతోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మహేశ్ మాట్లాడుకుందామని శివను బసంత్‌నగర్ ఎయిర్‌పోర్ట్ ప్రాంగణానికి రమ్మని చెప్పాడు. శివ తన మిత్రుడైన ఈసాలతక్కళ్లపల్లికి చెందిన రెడపాక వివేక్‌తో కలిసి ఎయిర్‌పోర్ట్‌కు వచ్చాడు. అప్పటికే మహేష్ తన మిత్రులతో కలిసి ఎయిర్‌పోర్ట్ స్థలంలో ఉన్నాడు. అమ్మాయి విషయమై ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. మహేష్‌తో పాటు అతని మిత్రులు బండరాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో వివేక్ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే చికిత్స నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. రావుల శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పొన్నం మహేశ్, కొండ మనోజ్‌తో పాటు మరికొంతమందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

‘శ్రీచైతన్య’ విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్: ఎంసెట్-2023 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. యు.మోహన్‌సాయి 256వ ర్యాంకు, ఎ.కీర్తన 896, కె.డింపుల్ జస్టినా 1,092, మధుకర్ 1,109, ఎస్.శ్రీనివాస్ 1,903, బి.సాయివినీత్ 2,078, ఐ.రమణి 2,770, డి.వంశీకృష్ణ 2,943, డి.కార్తీక్ 2,958వ ర్యాంకులు సాధించారు. 5వేల లోపు 12 మంది, 28 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఈసందర్భంగా రాష్ట్రస్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించిన శ్రీ చైతన్య విద్యార్థులను వారి తల్లిదండ్రులను చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాక్రిష్ణ, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

ఎంసెట్‌లో సత్తాచాటిన ‘అల్ఫోర్స్’



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఎంసెట్-2023 ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమర్యాంకులు సొంతం చేసుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కరీంనగర్‌లోని అల్ఫోర్స్ కేంద్ర కార్యాలయంలో గురువారం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి సన్మానించి ర్యాంకుల వివరాలు వెల్లడించారు. ఎం.అభిరామ్ 301వ ర్యాంకు సాధించి అత్యున్నత స్థానంలో నిలిచాడు. ఎ.ఇషాంత్‌రెడ్డి 322, బి.శ్రీగోధ 356, జి.జ్యోతి 374, టి.దీపిక 446, ఎం.చిన్మయ్ 542, బి.శ్రీనివాస్ 650, ఎస్.సాయిసధిష్ట 681, కె.ప్రణీత రెడ్డి 752, హస్వితరెడ్డి 818, బి.విద్యాలక్ష్మి 821, ఎస్.ధీరజ్‌కుమార్ 833, ఎన్.మనస్విని 865, ఆర్.సుహాసిత 893వ ర్యాంకు సాధించారు. అలాగే వెయ్యిలోపు 14 మంది, రెండువేల లోపు 40, మూడువేల లోపు 63, ఐదువేల లోపు 118 మంది ర్యాంకులు సాధించినట్లు వివరించారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ(మెయిన్) ఫలితాల్లో విద్యార్థులు సత్తాచాటి 450 మంది ఐఐటీ (అడ్వాన్స్)కి అర్హత సాధించారని గుర్తు చేశారు. రాబోయే నీట్ ఫలితాల్లో కూడా ఉత్తమ ర్యాంకులతో ముందంజలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు.

ట్రినిటీ విజయదుందుభి

కరీంనగర్: ఎంసెట్ ఫలితాల్లో పెద్దపల్లి, కరీంనగర్ ట్రినిటీ కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఎంపీసీ విభాగంలో ఎం.రాజారెడ్డి రాష్ట్రస్థాయిలో 186ర్యాంకు, టి.అభినయ 848, ఎన్.సుహాస్‌రెడ్డి 1128, పి.శ్రీథాన్ శాష్ 2007, బైపీసీ విభాగంలో వి.మధుకర్ 1109, డి.సాయిలక్ష్మి మానస 1969, బి.ప్రణయ్ 1976, షఫీ నాషీన్ 2321, ఎస్.ఫాతీమా 2464, కె.లిఖిత 2479, బి.దీపక్ 2531, ఎం.రేఖ 2698, వి.అర్పిత 2783 ర్యాంకులు సాధించారు. బి.సిరి 3126 ర్యాంకు, జి.హన్విత 3496, వి.శ్రీజ 3514, ఎం.డీ అబ్దుల్ ముజీబ్ 3675, శ్రీకిరణ్ 3752, పి.అరవింద్ కుమార్ 3875,ఎం.చంద్రశేఖర్ 4176, బి.సంధ్యవాణి 4190, ఎం.నిత్య 4348,జి.షారోన్ 4358, ఆర్.అలేఖ్య 4519, కె.త్రిష 4529, డి.దిలీప్ కుమార్ 4558, అయేషా మహాజాబీన్ 4759, వై.అశలేష్ 4896, బి.దీపకళ 4957, ఆర్.కావ్య 4985 ర్యాంకులు సాధించారు. రాబోయేకాలంలో మరిన్ని మంచి ఫలితాలను సాధిస్తామని ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

జర్నలిస్టు నేత్రాలు దానం



శంకర్ నేత్రాలను సదాశయ ఫౌండేషన్‌కు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో సీనియర్ జర్నలిస్ట్ ఎలిగేటి శంకర్(55) అంత్యక్రియలు గురువారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. పుట్టెడు దుఃఖంలోనూ శంకర్ నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి, ఇద్దరికి చూపును ప్రసాదించారు. నేత్రదానంపై బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు రవీందర్ అవగాహన కల్పించారు. స్పందించిన శంకర్ భార్య వాణి, కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా శంకర్ నేత్రాలను సేకరించి, హైదరాబాద్ లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు.

దళితరత్న అవార్డు అందుకున్న రాజేశ్



అవార్డు అందుకుంటున్న రాజేశ్

మంథని: అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం అందించిన దళితరత్న అవార్డును గురువారం జయంతి ఉత్సవాల కమిటీ వైస్‌చైర్మన్ దుర్గం రాజేశ్, మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు చేతుల మీదుగా మంథనిలో నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్ అందుకున్నారు. అవార్డుల ప్రదానోత్సవం సమయంలో రాజేశ్ అందుబాటులో లేకపోవడంతో స్థానికంగా స్వీకరించినట్లు తెలిపారు.

దాడి కేసు నమోదు

జ్యోతినగర్: పాత గొడవల కారణంగా వ్యక్తిపై రాడ్‌తో దాడి చేసిన ఘటనలో ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎల్కలపల్లి గేట్ ప్రాంతానికి చెందిన దమ్మాల వెంకటేశ్‌పై అదే ఏరియాకు చెందిన దబ్బెట సతీశ్, ఆనంద్, భానుచందర్ పాత గొడవల కారణంగా దుర్భాషలాడి, రాడ్‌తో దాడి చేశారు. బాధితుడి సోదరుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం

- జాతీయ సంఘాల నాయకుల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: వాస్తవాలను విస్మరించి హెచ్ఎంఎస్ నేత రియాజ్ ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోబోమని జాతీయ కార్మిక సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్‌ప్రసాద్, తుమ్మల రాజారెడ్డి, హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. వేజ్‌బోర్డు సమావేశాల్లో పాల్గొన్న హెచ్ఎంఎస్ నాయకుల్లో ఐక్యత లేదన్నారు. కోలిండియాలో ఒక విధంగా సింగరేణిలో మరో విధంగా హెచ్ఎంఎస్ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. హెచ్ఎంఎస్‌లోంచి రియాజ్‌ను తీసేస్తామని అనడంతో వేజ్‌బోర్డులో సంతకం పెట్టారని అన్నారు. వేజ్‌బోర్డు అడ్డంపెట్టి కార్మికులకు నష్టం చేస్తావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విధంగా ముందుకు సాగితే రియాజ్‌కు కార్మికులే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. క్యాడర్‌స్కీం, హెచ్ఆర్ఏ, అన్ని ఒప్పందాల్లో మెరుగైన విధంగా ఒప్పందం సాధించామన్నారు. కాంట్రాక్టు కార్మికుల హైపవర్‌కమిటీ వేతనాలు అందించేలా కృషి చేస్తామన్నారు. చిత్తశుద్ధి ఉంటే అందరం కలిసి పోరాటం చేస్తామన్నారు. నాయకులు రాజ్‌కుమార్, ఎల్లాగౌడ్, ధర్మపురి, సదానందం, మెండె శ్రీనివాస్, రాజమౌళి, శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్


గోదావరిఖని: జీవితంలో దొరికిన అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. గైర్హాజర్ కార్మికులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలోని పలు గనులు డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న 62మంది గైర్హాజర్ ఉద్యోగులు సమావేశానికి హాజరయ్యారు. ఈ రోజుల్లో సింగరేణిలో ఉద్యోగం దొరకడం ఎంతో అదృష్టమని, ఒక్కపుడు బొగ్గు గనుల్లో ఫిల్లింగ్ ఉండేదని, ప్రస్తుతం మ్యాన్‌రైడింగ్, మిషినరీ ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తున్నామన్నారు. కారుణ్య నియామకాల ద్వారా అందివచ్చిన అవకాశాన్ని గైర్హాజర్ మూలంగా పోగొట్టుకోవద్దన్నారు. చెడు వ్యసనాలకు, దురలవాట్లకు దూరంగా ఉండి ఉద్యోగంపై అంకితభావం అవలర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ నాయకులు శ్రావణ్‌కుమార్, ఎస్ఓటూ జీఎం రాంమోహన్, డీజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ చొరవతోనే అలవెన్స్ పెరుగుదల

- యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్

గోదావరిఖని: ఐఎన్‌టీయూసీ చొరవతోనే బొగ్గుగని కార్మికుల అలవెన్స్‌లు పెరిగాయాలని యూనియన్ సెక్రటరీ జనరల్, వేజ్‌బోర్డు సభ్యుడు జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం జీడీకే-1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 3లక్షలకుపైగా ఉన్న బొగ్గుగని కార్మికులకు మెరుగైన వేతన సవరణ జరిగేలా చూడటంలో ఐఎన్టీయూసీ చురుకైన పాత్ర పోషించిదన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్, కాంట్రాక్ట్ కార్మికుల హై పవర్ కమిటీ వేతనాలగురించి చర్చలే వనెత్తామన్నారు. కార్మికులకు అండర్‌గ్రౌండ్ అలవెన్స్, ఎల్టీసీ, ఎల్ఎల్‌టీసీ అనేక అలవెన్సులపై 25శాతం పెంపు సాధ్యమైందన్నారు. కార్మికులకు 5 రోజుల పితృత్వ సెలవులు అదనంగా లభించాయన్నారు. నాయకులు సదానందం, జనగామ రాజేశం, ధర్మపురి, వడ్డేపల్లి దాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్జీ- 3 జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

కమాన్‌పూర్(మంథని): 31న ఉద్యోగవిరమణ పొందుతున్న ఆర్జీ-3 జీఎం తన్నీరు వెంకటేశ్వర రావును గురువారం ఆర్జీ-3 సెక్యూరిటీ సిబ్బంది సన్మానించారు. సెక్యూరిటీని సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ కంపెనీలో చోరీలను నియంత్రించడానికి ఎంతోగానో కృషి చేశాడని అన్నారు. సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇనుగాల లక్ష్మినారాయణ, జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.జలీల్‌పాషా, జమేదారు అర్జున్, టీబీజీకేఎస్ జీఎం కమిటీ సభ్యుడు ఇసంపెల్లి రమేశ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు చెందిన ఎరువులు, పురుగుల మందు, విత్తనాలు విక్రయించే వ్యాపారులకు గురువారం కాల్వశ్రీరాంపూర్ రైతువేదికలో వ్యవసాయాధికారులు, పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ శ్రీనాథ్ మాట్లాడుతూ.. వ్యాపారులు నాణ్యమైన విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, బ్యాచ్‌నంబర్ విత్తన తయారీ కంపెనీపేరు రశీదులో తప్పని సరిగా రాయాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారుల లైసెన్స్‌లు రద్దుచేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. వ్యాపారులు బిల్‌బుక్ స్టాక్‌బోర్డు విధిగా అప్డేట్ చేయాలని ఏవో నాగార్జున సూచించారు. ఏఈవోలు రమేశ్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, పూర్ణచందర్ పాల్గొన్నారు.

పలు దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కాల్వశ్రీరాంపూర్‌లోని ఫర్టిలైజర్స్, ఫర్టిసైడ్స్, విత్తన విక్రయ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విత్తనాలు, బ్యాచ్‌నంబర్లు, తయారీ కంపెనీల చిరునామాలు తనిఖీ చేశారు. వానాకాలం సీజన్లో వ్యాపారులు వరిధాన్యం, పత్తి, మిర్చి విత్తనాలు కొనుగోలు చేసి నిలువ చేస్తారని అందుకే నకిలీ విత్తనాలు అరికట్టే చర్యల్లో భాగంగా ముందస్తు దాడులు నిర్వహించామని ఏవో నాగార్జున పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ కృష్ణ, ఏఈవోలు రాజు, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, పూర్ణచందర్ పాల్గొన్నారు.

పొత్కపల్లిలో

ఓదెల: ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలోని ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. పలుషాపుల్లో నకిలీవిత్తనాలు, ఫెస్టిసైడ్స్ విక్రయిస్తున్నారా అని ఆరా తీసినట్లు మండల వ్యవసాయాధికారి నాగార్జున పేర్కొన్నారు.

బ్యాంకు ఖాతా ఖాళీ

- సైబర్ క్రైం కేసు నమోదు

జ్యోతినగర్: వాట్సప్‌లో వచ్చిన సందేశం మేరకు లింక్ ఓపెన్ చేసి రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశపడి డబ్బులు పంపితే తనఖాతాలోని రూ.90వేలు పోగొట్టుకున్న విషయంపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగం చేస్తూ టౌన్‌షిప్‌లో ఉంటున్న అనోజ్‌కుమార్‌కు గత నెల 18వ తేదీన వాట్సప్‌లో డబ్బులు పంపిస్తే అధికంగా డబ్బులు చెల్లిస్తామని సందేశం రావడంతో ముందుగా లింక్‌ను ఓపెన్ చేసి రూ.5వేలు పంపించాడు. రూ.6,500 తిరిగి వచ్చాయి. మళ్లీ అధికమొత్తంలో డబ్బులు పంపిచగా.. మళ్లీ రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు

పాలకుర్తి(రామగుండం): మండలంలోని ధర్మారం క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద గురువారం ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బోనగిరి వెంకటసాయి(24)కి గాయాలు అయ్యాయి. ఎన్టీపీసీ మల్కాపూర్‌కు చెందిన వెంకటసాయి కారులో కరీంనగర్ వెళ్తున్నాడు. ధర్మారం క్రాస్‌రోడ్డు దాటిన తర్వాత పెద్దపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. వెంకటసాయికి గాయాలు అయ్యాయి. హెచ్‌కెఆర్ టోల్‌ప్లాజా అంబులెన్స్ సిబ్బంది వెంకటసాయిని చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.